అవ్వాతాతల్లో అవధుల్లేని ఆనందం

అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ మొత్తాన్ని పెంచుతున్నారు. మొన్నటి వరకు రూ.2500లు ఉన్న పింఛను మొత్తాన్ని ఈ నెల నుంచి రూ.2750కి పెంచారు. దీంతో సంక్రాంతికి రెండు వారాల ముందే గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. చిరునవ్వుతో అవ్వాతాతల ముఖాలు వెలిగిపోతున్నాయి. పింఛన్ల పెంపుతో తమకు మరింత ఆర్థిక భరోసా లభించిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – పాలకొండ/కురుపాం నెట్‌వర్క్


జియ్యమ్మవలస: పెదబుడ్డిడిలో వృద్ధులకు పెరిగిన పింఛను మొత్తాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు


గుమ్మలక్ష్మీపురం: చినమేరంగిలో తాడికొండకు చెందిన అవ్వాతాతలకు పెరిగిన పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ మండంగి రాధిక, సర్పంచ్ మండంగి జగ్గారావు, తదితరులు


వీరఘట్టం: పెరుగువీధిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎంపీటీసీ మంతిని హేమలత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి


వీరఘట్టం: తెలగవీధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ కర్రి లక్ష్మి


పాలకొండ రూరల్: ఓని గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న వైస్ ఎంపీపీలు కె.సూర్యప్రకాష్, వి.అనీల్‌కుమార్


భామిని: ఘనసరలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఫాల్గుణరావు, రాంప్రసాద్ పాత్రో, తదితరులు


భామిని: నేరడి-బిలో కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లి రాజశేఖర్, వలంటీర్లు


పాలకొండ: కొండాపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు


సీతంపేట: పీపీ ఈతమానుగూడలో పింఛన్ పెంపుపై ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

క్లుప్తంగా

రేషన్ డిపోల్లో పీఓ తనిఖీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: గిరిజన సహకారం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు రేషన్ డిపోలను ఐటీడీఏ పీఓ బి.నవ్య సోమవారం తనిఖీ చేశారు. మండలంలోని గొయిది, సీతంపేట ప్రధాన డిపోల్లో రికార్డులు, సరుకుల నిల్వలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి రేషన్ సక్రమంగా అందుతోందా లేదా, ఎండీయూ వాహనాల ద్వారా నెలనెలా ఇంటి వద్దకే రేషన్ తీసుకువచ్చి ఇస్తున్నారా లేదా, సరుకుల నాణ్యత ఎలా ఉంటోందని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మేనేజర్ దాసరి కృష్ణ ఉన్నారు.

ఉపాధి నిధులతో నర్సరీ అభివృద్ధి


నర్సరీలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న ఏపీడీ చంద్రమ్మ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎస్.కె.పాడులో ఉన్న ఉద్యానవన నర్సరీలో ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పార్వతీపురం క్లస్టర్ ఏపీడీ చంద్రమ్మ తెలిపారు. నర్సరీలో చేపట్టిన పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఉపాధి పని కావాలని దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నట్లు చెప్పారు. నర్సరీలో 15 పనుల కోసం ప్రతిపాదనలు పంపగా 9 పనులకు అనుమతులు వచ్చాయన్నారు. ఆమె వెంట ఏపీఓ శివరామకృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

7న మండల సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7న ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నీలకంఠరావు

సీతంపేట: మండలంలోని పులిపుట్టి గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై ఎస్సై ఎ.నీలకంఠరావు సోమవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. జీబ్రాక్రాసింగ్ గుర్తులు ఉన్నచోట మాత్రమే రోడ్డు దాటాలని, నిలిపి ఉంచిన కార్లు, వాహనాల వెనుక నుంచి పరుగెత్తుకుంటూ వెళ్లకూడదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


పెరటికోళ్ల యూనిట్లను పంపిణీ చేస్తున్న ఏపీఎం పార్వతి

సీతంపేట: పెరటికోళ్ల పెంపకంతో మహిళా సంఘాలకు అదనపు ఆదాయం లభిస్తుందని వైకేపీ హెచ్‌డీ ఏపీఎం పార్వతి అన్నారు. సీతంపేటలో 48 పెరటికోళ్ల యూనిట్లను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీటిని పెంచడం వలన ఆర్థికపరంగా లబ్ధి పొందవచ్చన్నారు. సంఘాల సభ్యులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.

ఇసుక తవ్వకాలు అడ్డగింత

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామాన్ని ఆనుకుని ఉన్న నాగావళి నదీతీరంలో ఆదివారం అర్ధరాత్రి ఇసుక తవ్వకాలు చేస్తున్న కొందరిని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామం సమీపంలో ఇసుక తవ్వకాలు చేస్తుండడంతో వర్షాకాలంలో వరద ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు, సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను కచ్చితంగా అమలు చేయాలి

• డీఐఓ టి.జగన్మోహనరావు


రోగులతో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ జగన్మోహనరావు

కొమరాడ: ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పరశురాంపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సేవలపై ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కచ్చితంగా వైద్య పరీక్షలు చేయాలని, అవసరమైన వారికి మందులు అందించాలని సూచించారు. ఆయనతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వినోద్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

• సబ్ కలెక్టర్ నూరుల్ కమర్


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పాలకొండ: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. పట్టణంలోని సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో కాలనీ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇంతవరకు నిర్మాణాలు ప్రారంభించని వారిని గుర్తించి వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా వారికి అవగాహ కల్పించాలని సూచించారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు సిమెంట్, ఇనుము, ఇసుకతో పాటు గృహ నిర్మాణ సామగ్రి అందించాలని సూచించారు.

సరైన ప్రణాళికతో సర్వతోముఖాభివృద్ధి


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: గ్రామాభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి చేపట్టడమే లక్ష్యమని గొట్ట మంగళాపురం సర్పంచ్ కరణం బాబ్జీ అన్నారు. గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డొంక త్రినాథులు మాట్లాడుతూ.. గ్రామస్తులకు శాశ్వత ప్రయోజనాలు కలిగేలా వివిధ అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు చెప్పారు. గ్రామస్తుల సూచనలు, అభిప్రాయాలను సేకరించారు. అలాగే మండలంలో లుంబూరు, అంపిలి గ్రామాల్లో సర్పంచులు తిర్లంగి ఉపేంద్రకుమార్, లోలుగు విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ వి.అనీల్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి


పాలకొండ రూరల్: ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి


వీరఘట్టం: భక్తులచే పూజలందుకుంటున్న రమా సత్యనారాయణస్వామి

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామంలో కొలువుతీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వజ్రకవచధరుడైన స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు సీతారామస్వామి ఆధ్వర్యంలో స్వామికి దశ విధ హారతి కార్యక్రమం చేపట్టారు. అలాగే అంపిలిలోని రామ మందిరంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

• **వీరఘట్టం:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక రమా సత్యనారాయణస్వామి ఆలయంలో అర్చకులు సర్వాజ్యోశ్యుల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే తెలగవీధి, కడకెల్లలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


రోడ్డుపై పడిఉన్న వాహనాలు

సీతంపేట: మండలంలోని కారెం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. దుగ్గిలో గ్రామ సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఆరిక సంతోషి తమ స్వగ్రామం కోడిశ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. అదే సమయంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై రాజు, దేవి వస్తున్నారు. కారెం సమీపంలో రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ముగ్గురికి గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. ఎస్సై ఎ.నీలకంఠరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీపీ బి.ఆదినారాయణ తదితరులు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు.

ద్విచక్ర వాహనం చోరీ

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్కింగ్‌లో ఉన్న తన ద్విచక్ర వాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైనట్లు పొదిలాపు శివాజీరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై బి.శివప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పార్వతీపురం జిల్లా పీఆర్.నాయుడుపేటకు చెందిన మరిపి గోవింద వాహనాన్ని దొంగిలించినట్లు గుర్తించారు. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, అతని నుంచి అపహరణకు గురైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

టిడ్కో క్యాలెండర్ ఆవిష్కరణ

పార్వతీపురం: ఏపీ టిడ్కో వార్షిక క్యాలెండర్‌ను ఆ సంస్థ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. గత ఏడాదిగా టిడ్కోలో జరిగిన అభివృద్ధి, నిర్మాణాల సముదాయాలను, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు తదితర అంశాలను తెలియజేసేలా వినూత్నంగా టిడ్కో వార్షిక క్యాలెండర్-2023ను రూపొందించి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కేవలం ఒక్క రూపాయికే ఇల్లు ఇచ్చే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. పేదలకోసం అహర్నిశలు కష్టపడి పని చేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. ఇంతవరకు రాష్ట్రంలో దాదాపు 45 వేల గృహాలను లబ్ధిదారులకు అందించగా, మరో మూడు నెలల్లో మరో 50వేల గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.


టిడ్కో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చైర్మన్ ప్రసన్నకుమార్

108లో ప్రసవం


తల్లీబిడ్డకు ప్రాథమిక వైద్య సేవలందిస్తున్న ఈఎంటీ

సీతంపేట: మండలంలోని రేగుమానుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ బిడ్డిక శశి 108 అంబులెన్స్‌లో శిశువుకు జన్మనిచ్చింది. సోమవారం ఉదయం ఆమెను పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. స్థానికంగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో రేగిడి మండలం నుంచి అంబులెన్స్ గ్రామానికి వచ్చింది. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలట్ జగన్నాథరావు, ఆశ వర్కర్ సరిత తల్లీబిడ్డకు ప్రాథమిక వైద్య సేవలు అందించి, అనంతరం సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సూపరింటెండెంట్‌గా నాగభూషణరావు


నాగభూషణరావు

పాలకొండ రూరల్: పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ గొర్లె నాగభూషణరావు (జనరల్ సర్జన్) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ నాగశివజ్యోతి (ఎండీ గైనికాలజిస్టు) కూడా విజయనగరం నుంచి వచ్చి విధుల్లో చేరారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన జె.రవేంద్రకుమార్ చిన్నపిల్లల వైద్య సేవలు అందించనున్నారు.

స్పందన వినతులు సత్వర పరిష్కారం


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ నవ్య


పాలకొండ: వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ: స్పందనలో అందించిన వినతులను సత్వరం పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని, అర్జీదారులు ఫిర్యాదుల స్థితిగతులను ఎప్పుడుకావాలంటే అప్పుడు తెలుసుకోవచ్చన్నారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే అర్జీదారులకు సమాచారం ఇస్తామన్నారు. స్పందనలో పింఛన్లు అందించాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు.

గిరిజన స్పందనకు 25 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి 25 వినతులు అందాయి. పీఓ బి.నవ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాతపట్నం మండలం కోణంగి గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

గులిమిసింగి గ్రామం నుంచి బిలుకలోవ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాలని శోబకు చెందిన సవర ఆనందరావు వినతిపత్రం అందజేశారు. పాంద్ర అక్కన్నగూడకు తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరారు. కుట్టుమిషన్ ఇప్పించాలని వజ్జాయిగూడకు చెందిన సవర సుశీల, కిరాణాషాపు పెట్టుకునేందుకు రుణం మంజూరు చేయాలని గుర్రాలమెట్టకు చెందిన గణేష్, స్కూల్‌లో వాచ్‌మెన్ పోస్టు ఇప్పించాలని కోరుతూ లోహరిజోలకు చెందిన విష్ణుశ్వరరావు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మురళి, ఏపీడీ నారాయణరావు, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం


నాగూరు గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ శిరీష

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని రావుపల్లి, నాగూరు, దళాయివలస, తదితర గ్రామాల్లో ఆయా పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన సోమవారం గ్రామసభలను నిర్వహించారు. నాగూరులో జరిగిన గ్రామసభలో రజకులకు అవసరమైన దోబిఖానా, ఎస్సీవీధిలో సీసీరోడ్డు, కాలువల నిర్మాణానికి సర్పంచ్ కేతిరెడ్డి శిరీష ప్రతిపాదన చేశారు. రావుపల్లిలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రణాళికలు, గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. దళాయివలసలో సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ గ్రామాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ వెంకటకూర్మినాయుడు, సాయికృష్ణ పాల్గొన్నారు.